క్రీడలతో మానసిక ఉల్లాసం

- జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈట గణేశ్

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నందిగామ సీఐ ప్రసాద్

నందిగామ, ఫిబ్రవరి 8 : చిన్నతనం నుంచే క్రీడలకు ప్రాధాన్యత ఇస్తే తప్పకుండా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చునని జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎన్ పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం నందిగామ విలేకరులు, పోలీసులు సంయుక్తంగా ఆడిన మ్యాచ్‌ను జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, నందిగామ సీఐ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చిత్తాపూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంచాల, ఫిబ్రవరి 8: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంచాల ప్రత్యేక అధికారి, ఏపీవో తేజ్‌సింగ్ అన్నారు. గురువారం మంచాల మండల పరిధిలోని చిత్తాపూర్, మంచాల గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో రోడ్లను శుభ్రం చేయించడం, కలుపు మొక్కలను తొలగించడం, తాగునీటి పైపులైన్ లీకేజీ వంటి పనులను చేపట్టినట్లు చెప్పారు. పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నవలయపల్లిలో పంటల పరిశీలన

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : మండల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి పంటలు పరిశీలిస్తున్నారు. గురువారం అంతారం అనుబంధ గ్రామం నవలయపల్లిలో మండల వ్యవసాయ అధికారిణి తులసి మొక్కజొన్న పంటలు పరిశీలించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఏవో మాట్లాడుతూ.. రైతులు సస్యరక్షణ చర్యలు చేపడుతూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏవో వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

హాజిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరంలో వైద్యులు, ప్రజలు

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 8 : ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి గ్రామంలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ క్లబ్ సభ్యుడు ఇస్నాతి శ్రీనివాస్ తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు షాద్‌నగర్ లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. గ్రామంలోని 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ లయన్ స్టార్ వైద్యుడు నాగవర్ధన్‌రెడ్డి, స్త్రీ, జనరల్ ఫిజిషియన్ విజయకుమారి, దంతవైద్యుడు అరుణ్‌కుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు మురళి, సాయికృష్ణ, నారాయణ, రమేశ్, అశోక్, గంగాధర్, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రజల సహకారం మరువలేనిది

పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : ఐదేండ్ల పదవీకాలంలో గ్రామ ప్రజలు పంచాయతీ పాలకవర్గానికి ఎంతో సహకారం అందించారని పల్గుట్ట గ్రామ మాజీ సర్పంచ్ మల్గారి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పల్గుట్ట గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గురువారం గ్రామ ప్రత్యేక అధికారి శిరీష, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, మండల కార్యదర్శి రామ్‌రెడ్డి, నర్సింహులు పంచాయతీ పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదమ్మ, రాజేశ్వర్ రెడ్డి, సుశీల, పావని, శ్రీకాంత్ గౌడ్, లక్ష్మమ్మ, భీమయ్య, పంచాయతీ కార్యదర్శి నరేశ్ గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కారోబార్ రాఘవేందర్ పాల్గొన్నారు.

షబ్-ఏ-మేరాజ్ను పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలోని జామ మసీదులో ముస్లింలు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-మేరాజ్ను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు జామ మసీదులో సామూహికంగా ఇషా నమాజ్ ప్రార్థనలు చేశారు. ప్రత్యేక నఫీల్ జమాజులు చేస్తూ, ప్రత్యేక దువాలు, తహజ్జు నమాజ్‌లు చేస్తూ గడిపారు.
– ఆమనగల్లు, ఫిబ్రవరి 8

కొనసాగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

అబ్దుల్లాపూర్ గ్రామంలో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

యాచారం : చౌదర్‌పల్లిలో ర్యాలీ తీస్తున్న అధికారులు, సిబ్బంది

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 : గ్రామాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన వారం రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా అబ్దుల్లాపూర్ గ్రామంలో పారిశుధ్య కార్మికులు రెండవ రోజు డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మమతాబాయి మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లను, డ్రైనేజీలను శుభ్రం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తుల్జాప్రసాద్, కారోబర్ సురేంద్రపాల్, పంచాయతీ సిబ్బంది, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

యాచారం : పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో రెండోరోజు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇండ్ల మధ్య ఉన్న చెత్తా చెదారం, కలుపు మొక్కలు, పాలిథిన్ కవర్లను తొలగించి తగులబెట్టారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గౌరెల్లి ప్రత్యేకాధికారి, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ గురువారం గ్రామంలోని పాఠశాలలను సందర్శించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బడిలో పలు వసతులు కల్పించాలని విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. పలువురు స్థానికులు ఈ సందర్భంగా రామకృష్ణను సన్మానించారు. తారామతిపేటలో ప్రత్యేకాధికారి, ఏవో కవిత పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట : గౌరెల్లిలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ తదితరులు

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

శంకర్‌కుమార్

యాచారం, ఫిబ్రవరి 8: మండలంలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ రామాంజనేయులు, యాచారం సీఐ సైదయ్యలను బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. యాచారం నూతన సీఐగా శంకర్ కుమార్ గురువారం బాధ్యతలను చేపట్టారు. మేడిపల్లి గ్రామంలో ఉన్న ఫార్మాసిటీ సీఐగా విధులు నిర్వహించిన రామాంజనేయులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా.. యాచారం సీఐగా విధులు నిర్వహించిన సైదయ్య అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో యాచారం నూతన సీఐగా భువనగిరి సీసీఎస్ సీఐగా విధులు నిర్వహించిన శంకర్ కుమార్, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ నూతన సీఐగా స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహించిన నాగరాజు సీఐలుగా విధులు నిర్వహించనున్నారు. సీఐ సైదయ్యను సిబ్బంది, ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

అబ్దుల్లాపూర్‌మెట్ సీఐగా సైదయ్య

పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఎస్ సైదయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఎ.మన్మోహన్‌యాదవ్ ఎస్బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాచారం ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న సైదయ్య వచ్చారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 8 : గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంజూరు చేసిన నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జంగయ్య, శివ, వెంకటేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

షాబాద్, ఫిబ్రవరి 8 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లారెడ్డిగూడ గేట్ సమీపంలో గురువారం జరిగింది. సీఐ తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన రంగయ్య(55) గురువారం మధ్యాహ్నం టీవీఎస్ మోపెడ్‌పై సంకెపల్లిగూడ నుంచి నాగరగూడకు వెళ్తుండగా మల్లారెడ్డిగూడ గేట్ సమీపంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న బోర్డుకు వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- మణికొండ మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్ కుమార్

మణికొండ, ఫిబ్రవరి 8: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌తో ట్రేడ్ లైసెన్సులు ఇస్తామంటూ ప్రజలను ఇబ్బంది పెడుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారి పట్ల మున్సిపాలిటీ వాసులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్ కుమార్ కోరారు. కొన్నాళ్లుగా మున్సిపాలిటీ పరిధిలో కొంతమంది అపరిచిత వ్యక్తులు తాము మున్సిపాలిటీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపార నిర్వాహణ కోసం లైసెన్సులు తీసుకోవాలంటూ, తక్షణమే డబ్బులు చెల్లించాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారనని పేర్కొన్నారు. ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని, అలాంటి ఫోన్‌కాల్స్ తమ కార్యాలయం నుంచి ఎవ్వరు చేయరని, అలా చేసేవారిపై అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ట్రేడ్ లైసెన్సులు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో https://cdma. cgg. gov. in/cdma_trade/NewT rade/GetCit_SaveNewTrade కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఎన్విరాన్మెంట్ విభాగం ఇంజనీర్ సంపత్‌ను సంప్రదించవచ్చునన్నారు. ఫోన్ ద్వారా 994915 7957 నెంబరుకు ఫోన్ చేసి మాట్లాడవచ్చునని తెలిపారు.

శిఖం భూమి పరిశీలన

నందిగామ, ఫిబ్రవరి 8: నందిగామ మండల పరిధిలోని ఉమ్మడి మామిడిపల్లి శివారులోని యేనం చెరువు శిఖం భూమిలో అక్రమంగా ప్రీకాస్ట్‌ను వేశారనే సమాచారంతో గురువారం మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. సర్వే నంబర్ 86, 87, 89లోని భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు చెరువులో నీరు లేని సమయంలో పక్కనే ఉన్న సర్వే నంబర్ 129 లోని శిఖం భూమిలో సుమారు ఒక ఎకరంలో ప్రీకాస్ట్ వేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రీకాస్ట్‌ను తొలగించాలని సంబంధిత వ్యక్తులకు సూచించినట్లు అధికారులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆమనగల్లు, ఫిబ్రవరి 8: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై బాల్‌రామ్ వివరాల ప్రకారం సింగంపల్లి గ్రామానికి చెందిన పెనివెళ్లి మహేశ్-లావణ్య భార్యా భర్తలు. వీరికి ఒక కూతురు ఉంది. మహేశ్ రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతడి కోసం బంధుమిత్రుల గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం సాయంత్రం మహేశ్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెరుగుతున్న కాలనీలు

- జనావాసాల మధ్య డంపింగ్ చేయడంతో పెరిగిపోతున్న దుర్వాసన
- చెత్తను డంపింగ్ చేసేందుకు సరిపడా స్థలం లేక ఇబ్బందులు
- ఈ పారిశుధ్య డ్రైవ్‌లోనైనా శాశ్వత పరిష్కారం చూపాలంటున్న స్థానికులు

పేరుకుపోతున్న చెత్త

మొయినాబాద్, ఫిబ్రవరి 8 : గ్రామాల్లోని పారిశుధ్య పనులు మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహిస్తుంది. ఈ డ్రైవ్‌లో పారిశుధ్యానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సమస్యలు ఉన్న గ్రామాల ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్తా చెదారం లేకుండా... మురుగు కాలువలను శుభ్రం చేయడం వంటి పనులను చేయిస్తున్నది. మొయినాబాద్ పంచాయతీ విస్తీర్ణంలో పెద్దది, 5 వేల నుంచి 6వేల వరకు జనాభా ఉంది. ప్రతి రోజూ రెండు ట్రాక్టర్ల చెత్త ఉత్పత్తి అవుతుంది. నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు, హోటల్స్ నుంచి వస్తున్న వ్యర్థాలు క్వింటాళ్ల కొద్దీ ఉత్పత్తి అవుతుంది. చెత్త నిలువ చేయడానికి డంపింగ్ కోసం సరిపడా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీకి ఆనుకుని కొంత ప్రభుత్వ భూమి ఉంటే అందులో చెత్తను నిలువ చేస్తున్నారు. కానీ ప్రతి రోజూ వస్తున్న చెత్తను నిలువ చేయడానికి ఆ స్థలం సరిపోక చాలా ఇబ్బంది పడుతున్నారు.

మొయినాబాద్‌లో సురంగల్ రోడ్డు పక్కనే చెత్త డంపింగ్ యార్డు

బైపాస్ వెళ్తున్న రోడ్డు పక్కనే

మొయినాబాద్ గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్తను హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వెళ్లే బైపాస్ రోడ్డు పక్కనే డంపింగ్ చేస్తున్నారు. మొయినాబాద్ గ్రామ పంచాయతీకి అనుబంధంగా కాలనీలు చాలా ఏర్పడ్డాయి. చెత్త డంపింగ్ యార్డును ఆనుకుని కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం డంపింగ్ యార్డు జనావాసాల మధ్య కావడంతో పాటు జాతీయ రహదారి బైపాస్ పక్కనే డంపింగ్ యార్డు ఉంది. బైపాస్ రోడ్డు పక్కనే ఉండటంతో పాటు సురంగల్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్క కూడా డంపింగ్ యార్డు ఉంటుంది. దీంతో చెత్త డంపింగ్‌కు స్థలం సరిపోకపోవడంతో సురంగల్ రోడ్డును ఆనుకుని చెత్త వేయడంతో పాటు కాలనీల్లోకి వెళ్లే రోడ్డు మీదనే గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్తను నిలువ చేస్తూ వెళ్లిపోతున్నారు. దీని వలన చెత్త కుప్పల్లో ఉండే ఆహార వ్యర్థ పదార్థాల కోసం కుక్కలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఆహార పదార్థాల కోసం కుక్కలు ఒకదాని మీద ఒకటి దాడులు చేసుకుంటూ రోడ్డు మీదకి వాహనాలకు అడ్డంగా వస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు పక్కనే చెత్త డంపింగ్ యార్డు ఉండటంతో ప్రమాదాలకు పెద్ద కారణంగా మారింది. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లోనైనా మొయినాబాద్ గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొయినాబాద్‌కు రెవెన్యూ లేకపోవడం ...

మొయినాబాద్ గ్రామ పంచాయతీకి అనుబంధంగా అనేక కాలనీలు ఏర్పడుతున్నాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కూడా వారి సౌకర్యార్థం మొయినాబాద్‌లోని వివిధ కాలనీల్లో నివసిస్తున్నారు. మొయినాబాద్ జనాభా గత పది ఏండ్ల కంటే రెండు రెట్లు పెరిగింది. పంచాయతీకి రెవెన్యూ లేకపోవడంతో డంపింగ్ యార్డు ఎక్కడ ఏర్పాటు చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీకి సంబంధించిన 117 సర్వే నంబర్‌లో 1.06 ఎకరాల భూమి ఉండటంతో కొంత కబ్జాకు గురికావడంతో పాటు ఉన్న కొద్ది స్థలంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. ఈ స్థలం కూడా సరిపోకపోవడంతో చెత్త ను రోడ్డు మీదనే వేస్తున్నారు. ప్రజలు కాలనీల్లోకి వెళ్లడానికి ఇబ్బందులు పడటంతో పాటు చెత్త నుంచి వెదజల్లె దుర్వాసనలతో చాలా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

పల్లెచెల్కతండాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 8: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు, పల్లెచెల్కతండాలో రూ.5 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ రాములుగౌడ్, నాయకులతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాలు, తండాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అనంతరం చరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపీపీ సందర్శించారు. పాఠశాల సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోకేశ్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, నాయకులు శ్రీనూనాయక్, జంగయ్య, రవి, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోలో మిగిలిన వస్తువుల వేలం పాట

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 8 : షాద్‌నగర్ ఆర్టీసీ కార్గో కౌంటర్‌లో మిగిలిపోయిన వస్తువులను ఈ నెల 13న ఉదయం 10 గంటలకు వేలంపాట వేస్తున్నట్లు డీఎం ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ ఆర్టీసీ కార్గో ద్వారా వస్తువులను ఒక చోటు నుంచి మరో చోటికి పార్సిల్, కొరియర్ చేస్తున్నామని, కొంత మంది పార్సెల్, కొరియర్ చేసి వస్తువులను ఎవ్వరూ తీసుకోకపోవడంతో ఆ వస్తువులను వేలంపాట వేస్తున్నట్లు తెలిపారు. కార్గో కౌంటర్ వద్ద మెడికల్ బాక్సులు, పోస్టర్లు, వివిధ రకాల వస్తువులు ఉన్నాయని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు షాద్‌నగర్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ సెల్ నంబర్ 9154298615 ద్వారా సంప్రదించాలని కోరారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : చేవెళ్ల మండల పరిధిలోని గొల్లపల్లి అనుబంధ గ్రామం ధర్మసాగర్‌ను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని పలువు ధర్మసాగర్ గ్రామస్తులు గురువారం వి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామేనా భీం భరత్, ఎంపీడీవో హిమబిందులకు వినతి పత్రాలు అందజేసి మాట్లాడారు. ధర్మసాగర్ గ్రామ అభివృద్ధి మరింత జరుగాలంటే ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటుతోనే సాధ్యమని అన్నారు.

మహిళ అదృశ్యం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 8: మహిళ అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సంగారెడ్డి రోడ్డులోని రైస్‌మిల్లు వద్ద నివాసం ఉంటున్న రాచూరి జయమ్మ(24) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. జనవరి 27న పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇండ్ల దగ్గర వెతికినా ఆచూకీ లేకపోవడంతో శంకర్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. ఆమె బయటకు వెళ్లే సమయంలో బ్లూ కలర్ టాప్, రెడ్ కలర్ లెగ్గిన్ వేసుకున్నట్లు తెలిపారు. జయమ్మ తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.